



బైరవానితిప్ప ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీరు

జిల్లాలో సాగునీటి లెక్కల్లో ఎక్కడా పొంతన కుదరడం లేదు. అవి నీటి మీద రాతల చందాన నీటి మీద లెక్కల్లాగా మారాయన్న విమర్శ ఉంది. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలోనూ నేతలు బాగుందని చెప్పకునేందుకు ప్రయత్నించారే తప్ప వచ్చిన నీటి వినియోగంపై ఎక్కడా చర్చ జరిగిన దాఖలాల్లేవు. అధికారులు కూడా నేతలను మెప్పించే విధంగా లెక్కలు చూపినట్లు ఆరోపణలొస్తున్నాయి. ఎందుకంటే వారు చెబుతున్న లెక్కలకు. క్షేత్ర స్థాయిలోనున్న దానికి పొంతన లేదు.

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి



పిఎబిఆర్‌లో ఉన్న నీటి మట్టం

# నీటి మీద లెక్కలు..

## హెచ్‌ఎన్ఎస్ఎస్ నుంచి పిఎబిఆర్‌కు 6 టిఎంసిలట..
## నిల్వ ఉన్నదే 5.44 టిఎంసిలు
## ఐఎబిలో అధికారుల లెక్కల్లో తేడాలు

హంద్రీనీవా నుంచి పెన్నహోబిలం బ్యాలెన్సింగు రిజర్వాయరుకు 6.182 టిఎంసిల నీరు ఇచ్చామని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు. ఇది కాకుండా హెచ్‌ఎల్ఎంసి నుంచి 2.746 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. అయితే ఆ డ్యామ్‌లో నీటి నిలువ ప్రస్తుతమున్నది 5.44 టిఎంసిలు మాత్రమే. దీని నుంచి ఇతర పంటలకేమైనా ఇచ్చారంటే అదీ లేదు. ఇటీవలి కాలంలో కొద్ది రోజులు విద్యుత్ ఉత్పత్తికి వాడారు. 220 క్యూసెక్కులు మాత్రమే ఈ డ్యామ్ నుంచి అవుట్‌ఫ్లో ఉన్నాయి. ఇలాగుంటే ఈ డ్యామ్‌లో గతేడాది సంబంధించి నీటి నిలువలున్నాయి. అంటే తుంగభద్ర డ్యామ్, ఇటు హంద్రీనీవా నీళ్లు జిల్లాకు రాకముందే అంటే జులై 17కు ముందే పిఎబిఆర్ డ్యామ్‌లో 1.92 టిఎంసిల నీళ్లు నిలువ ఉంది. దాదాపు రెండు టిఎంసిల నీళ్లు ఉన్నాయి. ఇప్పుడు తుంగభద్ర, అటు హంద్రీనీవా నుంచి ఇచ్చిన ఆరు టిఎంసిలు కలిపితే మొత్తం ఈ డ్యామ్‌లో ఎనిమిది నుంచి తొమ్మిది టిఎంసిల నీళ్లు నిలువ ఉండాలి. కాని ప్రస్తుతం ఈడ్యామ్‌లో 5.44 టిఎంసిలు మాత్రమే నిలువ ఉంది. ఈ లెక్కల్లో తేడాలు ఎందుకున్నాయన్నది తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

**మిడ్‌పెన్నార్ పరిస్థితి అదే తీరు**

జిల్లాల్లో హెచ్‌ఎల్ఎంసిపైనున్న మరో ప్రాజెక్టు మిడ్ పెన్నార్. దీని పూర్తి నిలువ సామర్థ్యం 5.17టిఎంసిలయితే ఇప్పటి వరకు నిలువ ఉన్నది 2.86 టిఎంసిలు మాత్రమే. అంటే 55 శాతం మాత్రమే నీరు నిలువ ఉంది. దీని నుంచి 980 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉంది. ఈ డ్యామ్‌లోనూ సీజన్ ఆరంభానికి ముందు 0.39 టిఎంసిలే నీరు ఉండేది. ఇక్కడ మాత్రం 2.50 టిఎంసిల వరకు హెచ్‌ఎల్‌సి నీరు వచ్చినట్టు కనిపిస్తోంది. అయితే పూర్తిగా ఇప్పటి వరకు ఇచ్చిన 16 టిఎంసిల్లో ఎక్కడా వినియోగంపై సరైన స్పష్టతను సాగునీటి సలహా మండలి సమావేశంలో తేల లేదు.

**హెచ్‌ఎల్‌సి నీటి వినియోగంపైనా అనేక సందేహాలు**

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఈ ఏడాది 24 టిఎంసిలు కేటాయించారు. ఇందులో 14.068 టిఎంసిల్లో పది టిఎంసిలకు తాగునీటి అవసరాలకు కేటాయించారు. ఈ కేటాయించిన దానిలో 7.847 టిఎంసిలు ప్రవాహ నష్టం కింద లెక్కవేశారు. ఇవిపోనూ 9.481 టిఎంసిలు సాగునీటికి, 6.740 టిఎంసిలు తాగునీటికి అన్నారు. ఇందులో ఇప్పటి వరకు 16 టిఎంసిలు నీళ్లు జిల్లాకు వచ్చాయి. ఇక ఎనిమిది టిఎంసిలు మాత్రమే రావాల్సి ఉంది. ఈ నీళ్లు జనవరి ఆఖరు వరకు రావాల్స ఉంటుంది. ఇప్పుడొస్తున్న ప్రవాహం ప్రకారమైతే మరో 40 రోజుల్లో జిల్లాకు వచ్చే నీరు ఆగిపోనుంది. పంటల ప్రకారం చూస్తే జనవరి ఆఖరు వరకు నీరు అవసరమవుతుంది. దీన్ని ఏ రకంగా సర్దుబాటు చేయాలన్నది నీటిపారుదల అధికారులు తేల్చాల్సుంది.

**నీటి లెక్కల్లో తేడాలెందుకు..?**

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా వచ్చిన 17 టిఎంసిలు, హెచ్‌ఎన్ఎస్ఎస్ ద్వారా వచ్చిన ఆరు టిఎంసిలు కలిపి మొత్తం 23 టిఎంసిలొచ్చాయి. ఇందులో ఈ నీటి వినియోగంపై సరైన స్పష్టత లేదు. అందుకే సాగునీటి సలహామండలి సమావేశంలోనే తేడాలు గమనించిన నేతలు మరోమారు అధికారులు సమావేశమై నిర్ధిష్టమైన ప్రణాళికతో రావాలని సూచించారు. అనంతపురం జిల్లా ప్రాజెక్టుల్లో అత్యంత ప్రధానమైనది పిఎబిఆర్ డ్యామ్. ఈ డ్యామ్‌కు వచ్చిన నీటి లెక్కల్లో తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముందుగానున్న 1.92 టిఎంసిలు, హంద్రీనీవా నుంచి ఇచ్చిన ఆరు టిఎంసిలు, ఇప్పుడు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచి వచ్చిన నీరు కలిపితే తొమ్మిది టిఎంసిల నీళ్లు ఆ డ్యామ్‌లో ఉండాల్సుంది. కాని సగమే ఉండటం గమనార్హం.

## బిటిపి, చాగల్లు రిజర్వాయర్ గేట్లు ఎత్తివేత

**ప్రజాశక్తి-గుమ్మగట్ట**

బైరవాని తిప్ప ప్రాజెక్ట్ కు వరద నీరు ఉధృతి ఎక్కువ కావడంతో రెండు గేట్లు ఎత్తినట్లు ఎఇ హరీష్ తెలిపారు ప్రాజెక్టు 1680 అడుగుల నీటిమట్టం సామర్థ్యముండగా ప్రస్తుతం 1652 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. పైనుండి దాదాపుగా 2000 క్యూసెక్కులు నీరు వస్తుండంతో ప్రవాహాన్ని బట్టి డ్యాం పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని స్పిల్ వే వద్ద గల 6 గేటు ఒక్క అడుగు, 7వ గేటు అర్ధఅడుగు ఎత్తి 1314 క్యూసెక్కుల నీటిని క్రిందికి వదులుతున్నట్లు ఎఇ చెప్పారు. వరద ఉధృతిని బట్టి చూస్తే ఆదివారానికి ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సందర్శకులు ఎవరు కూడా నీటి ప్రవాహంలో దిగొద్దని, ప్రవాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఈశ్వరయ్య సూచించారు.

**పెద్దపప్పూరు :** మండలం పరిధిలోని చాగల్లు గ్రామ సమీపంలో ఉన్న చాగల్లు ప్రాజెక్టు గేట్లను ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి శనివారం ఎత్తి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయర్ నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. పైన ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. దీంతో చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానదికి 250 క్యూసెక్కులు, పెండేకల్లు రిజర్వాయర్‌కు 200 క్యూసెక్కులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ లోకనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎపి ఎన్‌ఆర్‌టి సొసైటీ ద్వారా ప్రవాసాంధ్రులకు బీమా పథకం

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ప్రవాసాంధ్రులకు ప్రభుత్వం ఏపీ ఎన్‌ఆర్‌టి సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని అందిస్తోందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్‌లో ప్రారంభించారని తెలిపారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు లబ్ధి పొందవచ్చు అన్నారు. ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థుల కోసం ఈ పథకం ప్రవేశపెట్టబడిందన్నారు. బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని తెలిపారు.

**మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు హాజరై అర్జీలు అందజేయాలన్నారు.

## పరిశుభ్రతలో రాజీపడొద్దు : డిపిఒ

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

గ్రామాల్లో పరిశుభ్రత పనులు చేయడంలో రాజీపడొద్దని డిపిఒ నాగరాజనాయుడు సూచించారు. శనివారం మండల పరిధిలోని మానిరేవు గ్రామాన్ని డిపిఒ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా క్లాప్‌మిత్రలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి, పొడిచెత్త సేకరణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఇంటికీ రెండు రోజులకొకసారి క్లాప్‌మిత్రలు వెళ్లి చెత్తసేకరణ చేస్తున్నారా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా అపరిశుభ్రత పేరుకుపోకూడదని సూచించారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలించారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాలకు ప్రధానంగా వేరుశనగ, కంది, పప్పుశనగ, మొక్కజొన్న, అరటి, టమోటా, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఆయా పంటలు చేతికి వచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో మదనపడుతున్నారన్నారు. కావున వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. అదేవిధంగా పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. నష్టపోయిన పంటలకు బీమా ఇవ్వాలన్నారు.

## నీరెలా ముందుకు సాగేది..?

**ప్రజాశక్తి-నార్పల**

**కంపచెట్లతో నిండిన కూతలేరు వంక**

మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న కూతలేరు వంక కంపచెట్లు, చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో నీరు ముందుకెళ్లలేక పోతోంది. సాధారణంగా వర్షాకాలంలో కూతలేరు వంక గలగల పారుతూ చూపరులకు కనువిందు చేస్తూ ఉండేది. దీనికితోడు వంక వెంబడి ఉన్న తాగునీరు, వ్యవసాయ బోర్లలో నీరు సంవృద్ధిగా ఉండేది. అయితే గత కొన్ని రోజులుగా కూతలేరు వంక చెత్తాచెదారం, విపరీతంగా కంపచెట్లతో పెరగడంతో కనీసం వంకలోని బురద కూడా కనిపించని పరిస్థితి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూతలేరు వంక పారితే నీరు ఎలా వెళ్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండల రైతులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కూతలేరు వంకలో పెరిగిన కంపచెట్లను తొలగించడంతోపాటు చెత్తాచెదారం తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంపచెట్లతో నిండిన కూతలేరు నది

## రెండువారాల్లో టిడ్కో ఇళ్ల పనులు ప్రారంభించాలి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

2 వారాల్లోపు అనంతపురం నగర శివారులోని చిన్మయనగర్ వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పున్ణప్రారంభం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. అనంతపురంలోని ఆర్,బి గెస్ట్ హౌస్‌లో శనివారం హౌసింగ్, టిడ్కో, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల టిడ్కో ఇళ్లను పరిశీలించిన అక్కడున్న పరిస్థితుల గురించి అధికారులతో చర్చించారు. ఇప్పటికే 34 బ్లాక్స్ లో పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగినట్టు చెప్పారు. వచ్చే రెండు వారాల్లోపు ఖచ్చితంగా పనులు ప్రారంభం కావాలన్నారు. మార్చి చివరి నాటికి వీలైనన్ని ఎక్కువ ఇళ్లు పూర్తి కావాలన్నారు.

**సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ :** ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. మొత్తం 27 మందికి రూ.19 లక్షల విలువైన చెక్కులు అందజేశారు.

## నష్టాలతో మద్యం దుకాణాలు నిర్వహించలేం

### వైన్‌షాపు యజమానులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

మద్యం విక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. తీవ్రంగా నష్టపోతున్నాం. తాలిబొట్లు, బంగారం తాకట్టు పెట్టి మద్యం షాపులు నిర్వహించే దుస్థితి నెలకొంది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే షాపులు నిర్వహించలేమని మద్యం షాపు యజమానులు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మద్యం షాపు యజమానుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈశ్వర్ వైన్స్ చంద్రశేఖర్ నాయుడు, అనురాధా వైన్స్ సీనా, రాజశేఖర్ వైన్స్ సాయిప్రసాద్, నంబూరి వైన్స్ వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ మద్యం షాపులు నిర్వహణ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి 20 శాతం కమీషన్ ఇస్తామని చెప్పిందని అయితే 10 శాతం మాత్రమే ఇస్తున్నారని అన్నారు. మద్యం విక్రయాలు జరుగుతుంటే కమీషన్ ఆలస్యమైనా షాపు నిర్వహించుకోవచ్చని అయితే ఈ మధ్య కాలంలో మద్యం విక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయని వాపోయారు. నగరంలోని అన్ని వైన్స్ షాపులు నష్టాల్లో నడుస్తున్నాయని తెలిపారు. బార్లలో ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయించడంతో వినియోగదారులు అక్కడికే వెళ్లి తాగుతున్న పరిస్థితి నెలకొందన్నారు. బార్‌లో విక్రయిస్తున్న మద్యానికి, వారు కొనుగోలు చేస్తున్న మద్యానికి వ్యత్యాసం పరిశీలిస్తే నిజా నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. సమస్యలపై ఎక్సైజ్ శాఖ అధికారులకు విన్నవించిన స్పందన లేదన్నారు. మద్యం షాపు నిర్వహణ, లైసెన్స్‌లకే ఏడాదికి రూ.65 లక్షలు చెల్లిస్తున్నామని, రెండవ ఏడాది నిర్వహిస్తే రూ.71 లక్షలు చెల్లించాలని అన్నారు. ఏడాదిలోనే పూర్తిగా నష్టాలు వచ్చాయని తెలిపారు. ఇలాగే విక్రయాలు పడిపోయి, ప్రభుత్వం ఇస్తామన్న 20 శాతం కమీషన్ ఇవ్వకపోతే మద్యం షాపులు నిలిపివేస్తామన్నారు. షాపు తాళాలు ఎక్సైజ్ శాఖ అధికారులకే అప్పగించే పరిస్థితి దాపురిస్తోందన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా వైన్ షాపులు, బార్‌లు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

**జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్**

**ప్రజాశక్తి-రాప్తాడు**



పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

విద్యార్థులు ఇప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం అలవాటు చేసు కోవాలని జెవివి రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ సూచించారు. జెవివి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని ఎపి మోడల్ హైస్కూల్లో ప్రిన్సిపల్ ఎస్.అంజలీదేవి అధ్యక్షతన ఎన్ఎంఎంఎస్ ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిం చినప్పడే నిజాన్ని మాత్రమే నమ్ముతారన్నారు. అబద్ధాలను నమ్మరాదన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, హైస్కూల్ ఉపాధ్యాయులు కె.శివానంద, కె.మధుసూదన్, బి.గంగాద్రి పాల్గొన్నారు.

## బిటిపి స్పిల్‌వేలో ఇరుక్కుని యువకుడు మృతి

### ప్రాణాలతో బయటపడ్డ మరో ఇద్దరు



వివరాలు మెయిన్‌లో..

# భూ మంటలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**




భూముల ధరలు పెరిగిన నేపథ్యంలో అధికార బలమున్న వారు వాటిని దక్కించుకుని సులభంగా కోట్లు సంపాదించవచ్చునన్న ఉద్దేశ్యంతో అందరి కళ్లు భూములపైనే పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో వరుసగా భూములకు సంబంధించిన అంశాలే వెలుగులోకి వస్తున్నాయి. వీటి వెనుక అధికారపార్టీ నేతల ప్రమేయమున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయంలోనూ ఇటువంటివే వచ్చినప్పటికీ ఇప్పుడు మరింతగా పెరిగినట్టు కనిపిస్తున్నాయి. ఈ వారంలో అనంతపురం రూరల్ మండలంలో పరిధిలోని పాపంపేట గ్రామం పరిధిలోని ఇనామ్ భూముల వ్యవహారం రాష్ట్ర స్థాయిలోనే చర్చనీయాంశమైంది. 1953 నాటికి ఇనామ్ భూములు కలిగిన వారి వారసులు ఇప్పుడొచ్చి భూములు తమవేనని చెబుతుండటంతో గమనార్హం. దానికి సంబంధించి జిపిఎ అధికారపార్టీకి సంబంధించిన నేతలకు ఇవ్వగా వారు ఖాళీ జాగాల్లో ఈ భూములు తమవేనని బోర్డులు పాతిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఇనామ్ భూములకు సంబంధించి ఏ రకంగా పాత వారసులకు సంబంధించినవ్నది చర్చ నడుస్తోంది. వాస్తవానికి 1955లోనే ఇనామ్ భూముల రద్దు చట్టమొచ్చింది. అంటే ఎవరైనా ఇనామ్ భూములు పెద్దఎత్తున కలిగున్నట్లయితే వాటిని రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఉంది. అయితే సాగులో ఎవరైనా ఉంటే వారు రైతువారి పట్టాలు పొందాల్సి ఉంది. ఆ రైతు వారి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఇవ్వాలని ఉంది. కాని ఇప్పుడు పాపంపేట గ్రామం పరిధిలో చూసినప్పుడు రాచూరి వెంకట కిరణ్ అనే వ్యక్తి తమ వారసుల నుంచి వంద ఎకరాలు అలాగే వచ్చినట్టు, మధ్యలో ఇతరులు వచ్చి అందులో ఉంటున్నట్టు సమర్థించుకుంటున్నారు. జిపిఎ సమయంలోనూ రిజిస్ట్రేషన్ అధికారులు ఏ మాత్రం పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేసారన్న ఆరోపణలున్నాయి. ఎప్పుడో జిపిఎను రద్దు చేసామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇప్పుడు చెబుతున్నారు. అయితే రెవెన్యూ చట్టాల ప్రకారం చూసుకున్నా ఇంత పెద్దఎత్తున భూమి ఒక వ్యక్తికి ఇప్పటికీ ఎలాగుందన్న ప్రశ్న మాత్రం ఉత్పన్నమవుతోంది. ఎందుకంటే 1975లో ల్యాండ్ సీలింగ్ యాక్టును ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం తరి భూమి అయితే పది ఎకరాలు, మెట్ట భూమి అయితే 25 ఎకరాలకు మించి భూమి ఉండటానికి వీల్లేదు. అంతకుపైనుండే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారమైనా రాచూరి వెంకటకిరణ్‌కు వందల ఎకరాలపై హక్కు ఏ విధంగా వస్తుందన్న ప్రశ్న ఉత్పన్నవుతోంది. ఈ రకంగా రెండు చట్టాలున్నా రాచూరి కుటుంబ వారసులకు ఏ రకంగా వందల ఎకరాలపై హక్కుందని వాదనపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతకు మునుపు ఎకరం భూమిని యజమానులకు తెలియకుండా డబుల్ రిజిస్ట్రేషన్ అవడం, బాధితులు ముఖ్యమంత్రికి, నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి అది డబుల్ రిజిస్ట్రేషన్ అని తేల్చారు. ఇలా వరుస భూముల వ్యవహారంపై విపక్ష పార్టీలు ఆందోళనకు సిద్ధమయ్యాయి. పాపంపేటకు సంబంధించి పరిరక్షణకు అన్ని పార్టీలతో కలిపి పరిరక్షణ కమిటీ ఏర్పాటైంది. ఇది రాజకీయంగానూ దుమారం రేగుతోంది. ఈ భూముల కాజేయడం వెనుక రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల కుటుంబ సభ్యుల పాత్ర ఉందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇక ప్రకాశ్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు తమపై చేస్తున్నారని టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్ ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఇలా ఇద్దరి మధ్య రాజకీయవేడిని రాజేస్తున్నాయి.

# చీకట్లో పుట్లూరు

## పని చేయని ట్రాన్స్‌ఫార్మర్- ఇబ్బందుల్లో ప్రజలు


ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-పుట్లూరు**

రెండు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో పుట్లూరు చీకట్లో ఉంటోంది. మండల కేంద్రంలోని చెరువు కట్ట వీధిలో శుక్రవారం రాత్రి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ శనివారం ఉదయం 9 గంటలైన రాకపోవడంతో ప్రజలే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయించుకోవాల్సి వచ్చింది. అయినా తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో 'యథారాజా తథాప్రజా' అయినట్లు అయిందని మండల వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తీర్చాలని మండల వాసులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

## స్టాండింగ్ కమిటీ సభ్యుల ఆవేదన


సమావేశంలో పాల్గొన్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.కోట్లతో టెండర్ పనులు నిర్వహించినా నగరంలో ఎందుకు అభివృద్ధి పనులు జరగటంలేదని మేయర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన శనివారం కార్పొరేషన్‌లోని మేయర్ ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలో పొందుపరిచిన వాటర్‌వర్క్స్, పారిశుధ్య అద్దె ట్రాక్టర్ల ప్రతిపాదన ఆమోదించారు. తర్వాత కుక్కల బెడదపై చర్చించారు. కుక్కల బెడద నివారించడానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. తర్వాత నగరంలోని ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారటంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న ఆర్అండ్‌బి రహదారి గుంతలు ఏర్పడి కంకర తేలడంతో ఇబ్బందిగా మారిందన్నారు. నగరంలో చిన్నపాటి వర్షానికి సైతం రహదారులు జలమయమవుతున్నాయన్నారు. వంకలు ఆక్రమణలకు గురై కుచించుకుపోవడంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు వస్తోందన్నారు. రెండేళ్ల క్రితం వచ్చిన నడిమివంక వరదల కారణంగా 5, 6 రోడ్లతోపాటు సోమనాథ్‌నగర్, రజకనగర్, తదితర ప్రాంతాలన్నీ నీట మునిగాయన్నారు. కావున ఎప్పటికప్పుడు వంకల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు.

# విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

**గుంతకల్లు :** పట్టణ పరిధిలోని ధోనిముక్కల రోడ్డులో ఉన్న 12వ లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని విద్యుత్ శాఖ డి.1 ఎఇ నాగేంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ 12వ లే అవుట్‌లో సుమారుగా 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వారందరూ విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతం పట్టణ శివారు కావడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని చెప్పారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, నాయకులు నాగిరెడ్డి, పట్టణ పౌరుల సంఘం నాయకులు చంద్ర, కాలనీవాసులు సీనా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం

## రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని.. కేవలం నివారణ ఒక్కటే మార్గమని రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వేపులపర్తి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఐవి, టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్ష చిన్నచూపు లేకుండా ఎలాగా సమాజంలో కలిసి జీవించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు రోషన్‌బాషా, ఉపాధ్యాయులు, రిడ్స్ సిబ్బంది కిరణ్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 'సహకారానికి' తోడ్పాటు

## ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు కష్టపడి పని చేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీటీ ఆడిటోరింలో అనంతపురం, కర్నూలు, కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగస్తులకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది తమ పరిధిలోని నిరర్థక ఆస్తులను తగ్గించాలన్నారు. అలాగే బంగారు నగల తాకట్టుపై విరివిగా రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. పరపతి వ్యాపారం కాకుండా.. పరపతేతర వ్యాపారం కూడా చేయాలన్నారు. ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది తీసుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ సురేఖారాణి, లక్నో నుంచి విచ్చేసిన శిక్షకులు శిఖా త్రిపాఠి, డిజిఎంలు రామ్‌ప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి, డిపిడిఎం తేజస్విని, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాబు

**యల్లనూరు :** మండల కేంద్రానికి చెందిన దొడ్లో బాబు, చిన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, శారదా విద్యా మందిరంలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొడ్లో బాబు మాట్లాడుతూ తమ కుటుంబ పెద్దలు ప్రజల కోసం పాటుపడ్డారన్నారు. వారిని స్మరించుకుని వెయ్యిమంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్లో కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

# పోలీసుల సేవలు మరువలేనివి : ఎస్పీ

**అనంతపురం :** ప్రజల రక్షణ, క్రమశిక్షణకు పోలీసులు ప్రతీకలు అని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిల్లో ఉన్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను పోలీసు స్టేషన్లకు రప్పించి వివరించారు. పోలీసుల త్యాగం మరువలేనిదన్నారు. కొంతమంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేస్తారన్నారు. అలాంటి వారి కృషిని మరువకూడదన్నారు. విద్యార్థులు కూడా భవిష్యత్తులో మంచి పౌరులుగా, క్రమశిక్షణతో జీవించాలన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

**యాడికి :** భారతీయ పత్తి సంస్థ ద్వారా తాడిపత్రిలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింజ పొడవును బట్టి ధర నిర్ణయించి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పంట పండించిన రైతులు వారి ఆధార్, బ్యాంకు ఖాతా లింకైన ఖాతాకు డబ్బు జమ చేయనున్నట్లు తెలిపారు. కావున రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# పాపంపేటలో ఒక్క ఇటుకనూ కదిలించలేరు

## ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్


మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

పాపంపేటలో ఎవరూ ఒక్క ఇటుక కూడా కదిలించలేరని, ఇది 'ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ వైపు నుంచి ఇస్తున్న మాట' అంటూ ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. గత కొన్ని రోజులుగా పాపం పేటలో భూ వివాదంపై వస్తున్న ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. శనివారం కళ్యాణదుర్గం రోడ్డులోని పాపంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ భూసమస్య గురించి తన వద్ద కూడా సరైన సమాచారం లేదని, అధికారులతో రెండు రోజుల్లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నానని వివరించారు. వాస్తవంగా ఇక్కడ 930 ఎకరాల్లో భూ సమస్య అంటూ ప్రజల్ని భయాందోళనకు గురి చేశారన్నారు. వాస్తవంగా ఇక్కడ సమస్య ఉంది కేవలం 20 ఎకరాల్లో మాత్రమే అన్నారు. అది కూడా కోర్టులో ఉందన్నారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయ నిరుద్యోగిగా మారిన ప్రకాష్‌రెడ్డి లాంటి మరికొందరు వైసిపి నాయకులు ఈ వివాదాన్ని సృష్టించారన్నారు. ఇటీవల ప్రకాష్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా కూడా తొలగిస్తారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జగన్ దృష్టిలో పడేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరూ వదంతులను నమ్మొద్దని.. పాపంపేటలో ఏ ఇంటపై చేయి పడినా.. అది మా ఇంటిపై పడినట్లేనని స్పష్టం చేశారు.

# నేడు 'సిమ్స్' సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాయలసీమ స్థాయిలో కార్పొరేట్ హంగులతో అనంత ఆరోగ్య మకుటంగా సాయినాథ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించనున్నట్లు 'సిమ్స్' బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు డాక్టర్ స్వరూపారెడ్డి, డాక్టర్ అశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సునీత, డాక్టర్ అభినయరెడ్డి, డాక్టర్ ప్రణీత, వసంతలక్ష్మి, చెన్నకిషోర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ రాయలసీమ స్థాయిలో కార్పొరేట్ హంగులతో సామాన్యులకు సైతం నాణ్యమైన వైద్యం అందించే దిశలో స్విమ్స్ రూపొందించినట్లు తెలిపారు. ఒకటిన్నర ఎకరాలో నాలుగు అంతస్తుల్లో 300 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిఆపరు. ఆసుపత్రిలో 8 మాడ్యులర్ లామినార్ ఫో ఆపరేషన్ థియేటర్లు,120 పడకల ఐసియు సౌకర్యం, 20 పడకల నియోనాటల్, పీడియాటిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, 25కుపైగా వైద్య, శస్త్రచికిత్స, సూపర్ స్పెషాలిటీ సేవలు, ప్రపంచ స్థాయి డయాగ్నోస్టిక్ సేవలు, సీమెన్స్ అధునాతన క్యాత్ ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఇవిఎం గోడౌన్ తనిఖీ


ఇవిఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

నగరంలోని పాత ఆర్‌డిఒ కార్యాలయం ప్రాంగణం వద్ద ఉన్న ఇవిఎం గోడౌన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మలోలా శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోడౌన్ గదుల్లో భద్రపరిచిన తలుపులకు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలో ఉన్న ఇవిఎం గోడౌన్లను ప్రతిమాసానికి, త్రైమాసానికి ఒకసారి తనిఖీ చేయాలన్నారు. గోడౌన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గోడౌన్ గదులతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం సందర్శన రిజిస్టర్‌లో డిఆర్ఒ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం తహశీల్దార్ హరిప్రసాద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, ఎస్ఎ శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం

## విప్ కాలవ శ్రీనివాసులు


ఆర్థికసాయం అందజేస్తున్న విప్ కాలవ

**ప్రజశక్తి-కణేకల్లు**

తెలుగుదేశం పార్టీలో ఎవరికి ఇబ్బంది వచ్చినా కుటుంబ సభ్యుడిలా ఆదుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉంటుందని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల బండల పాలిసింగ్ యూనిట్‌లో పని చేస్తూ గాయపడిన టిడిపి కార్యకర్త కనేకల్లుకు చెందిన సలీం కుటుంబాన్ని విప్‌తోపాటు నాయకులు పరామర్శించారు. ఇందులో భాగంగా పార్టీ తరపున రూ.50వేలు, జామియా మజీద్ ముత్తవల్లి ముర్షద్ పీర్ ఖాద్రీ రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. సలీం గాయపడటంతో కుటుంబం ఇబ్బందుల్లోకి వెళ్లిందన్నారు. ఆయన భార్య కూడా పని చేసే పరిస్థితుల్లో లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాయం చేసి అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాలేప్ప, మాజీ సర్పంచు షేక్ ఫక్రుద్దీన్, మాజీ ఉపసర్పంచు ఆనంద్ రాజ్, నీటి సంఘం అధ్యక్షులు రమేష్, ఆదర్శ భారతి సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్, షేక్ హుస్సేన్, గౌస్‌సాబ్, చాందు, బండ సలీం రహీం, బురాన్ మహబూబ్‌సాబ్, వన్నారెడ్డి, సుదర్శన్, నాగభూషణం, అనిల్ పాల్గొన్నారు.

# పత్తికి కనీస మద్దతు ధర

**ప్రజాశక్తి-గుత్తి**

భారతీయ పత్తి సంస్థ ఆధ్వర్యంలో గుత్తిలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30.50 ఎంఎం ఉన్న పత్తికి కనీస మద్దతు క్వింటా రూ.8110, 29.49 ఎంఎం ఉన్న క్వింటా పత్తికి రూ.8010 ధర ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. పత్తి విక్రయించిన రైతులకు వారి ఖాతాల్లో సొమ్ము జమవుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

# పొగాకుకు యువత దూరంగా ఉండాలి

## పొగాకు నియంత్రణ జిల్లా సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు

**ప్రజాశక్తి అనంతపురం**

ప్రజలు, యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ జిల్లా సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు పిలుపునిచ్చారు. 'టోబాకో ఫ్రీ యూత్ కాంపెయిన్ 3.0'లో భాగంగా య పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పల్లె రఘునాథ్‌రెడ్డి విద్యాసంస్థ, శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పొగాకుకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌కెయు డీన్ రవీంద్రనాథ్ రెడ్డి సిగరెట్టు, ఇతర పొగాకు సంబంధింత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ క్యాన్సర్ వంటి భయానిక వ్యాధులు రాకుండా నివారించుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల పరిధిలో ఉన్న దుకాణాల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదన్నారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఓ ముత్యాలప్ప, వ్యవసాయ యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


# ఉద్యమ సహకారం మరువలేనిది..

**ప్రజాశక్తి-గుంతకల్లు**

కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని తాము చేపట్టిన ఉద్యమానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు క్షవర వృత్తిదారులు సంఘం పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని 50 రోజుల నుంచి వివిధ రూపాల్లో అనేక ఆందోళనలు చేశామన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హామీతో ఆందోళనలను విరమించామన్నారు. తమ పోరాటానికి మద్దతిస్తూ ప్రత్యక్షంగా పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో క్షవర వృత్తిదారులు సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి సూరి పాల్గొన్నారు.

# స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

## మంత్రి సత్యకుమార్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

**ప్రజాశక్తి-అనంతపురం**

స్వదేశీ ఉత్పత్తులను దేశీయంగా తయారు చేయడానికి మనమందరం ప్రోత్సహించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'ఆత్మనిర్భర్ భారత్'పై మంత్రి విశిష్ట ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి భాషపై గర్వం కలిగి ఉండి మన సంస్కృతి, వారసత్వాలను విలువైనవిగా భావించాలని సూచించారు. భారతదేశం చారిత్రాత్మకంగా స్వయం సవృద్ధి కలిగిన దేశమన్నారు. అయితే వెయ్యి సంవత్సరాల విదేశీ పాలన తర్వాత మనం దిగుమతులపై ఆధారపడే పరిస్థితికి చేరామని గుర్తు చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత భారత్ ప్రపంచంలోని మూడవ అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎస్ఎ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఫ్రిడ్జి, వాషింగ్ మిషన్‌ను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

# వాషింగ్ మిషన్ వితరణ

**ప్రజాశక్తి-అనంతపురం**

గొట్కూరులోని బెరకా (శాంతి నిలయం) వృద్ధాశ్రమానికి ఫ్రిడ్జ్‌తోపాటు వాషింగ్ విషన్‌ను శనివారం వితరణ చేశారు. ఇటీవల రామ్‌నగర్‌లో మృతిచెందిన బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి మధుసూదన్‌రావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కడపకు చెందిన శ్రీదేవి, భర్త రవికుమార్, బావమరుదులు సోమశేఖర్, రోహిత్ సహకారం అందించినట్లు సాయిట్రస్టు అధ్యక్షులు విజయ సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు రోహిత్, సాయిట్రస్టు బృందం సభ్యులు రాఘవేంద్ర, విజయభాస్కర్, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.




# కోటి సంతకాలతో గవర్నర్‌ను కలుస్తాం

## వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన కోటి సంతకాలతో త్వరలో గవర్నర్‌ను కలుస్తామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి వద్ద ఉన్న తన ఫామ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పిపిపి విధానంతో మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో పేద విద్యార్థులకు వైద్య విద్య 'అందని ద్రాక్ష'లా అవుతందన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాలతో త్వరలో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి జడ్పీటీసీ భాస్కర్, నాయకులు పూల ప్రసాద్, పార్వతి, పూల నారాయణస్వామి, బయపరెడ్డి, అంకే నరేష్, చికెన్ నారాయణస్వామి, కెకె అగ్రహారం నారాయణ, అది, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతన్న సాకే శైలజానాథ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

# విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విప్ కాలవ శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో కొత్త సోలార్ ప్లాంట్ ఏర్పటు కాబోతోందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోనే 7500 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేయడానికి పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. విద్యుత్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ శేషాద్రినాయుడు జిల్లాలో నూతనంగా 22 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. అలాగే ప్రధానమంత్రి సూరత్ పేరుతో ప్రతి ఇంటికీ సోలార్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, బీసీ ఓసీలకు 30 శాతం సబ్సిడీతో సోలార్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ప్రమీలమ్మ, ఎంపిటిసి శ్రీదేవి, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు కేశప్ప, కొత్తపల్లి మల్లికార్జున, అధికారులు రాజశేఖర్, శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, చైతన్య లక్ష్మి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## బంగారు నగలు చోరీ

**శింగనమల :** మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన జానకొండ నాగభూషణం బంధువుల ఇంట్లో పెళ్లి ఉండటంతో బ్యాంకులో తాకట్టు ఉన్న 8 తులాలు బంగారు నగలను తీసుకొచ్చి ఇంట్లోని పెట్టెలో భద్రపరిచాడు. శుక్రవారం రాత్రి అందరూ ఇంటిపైన ఉన్న రూమ్‌లో నిద్రపోయారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని దుండుగులు కింద ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని ట్రంకు పెట్టెను ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలోని ఓ పొలంలో పెట్టెను పగులగొట్టి 8 తులాలు బంగారంతోపాటు 10 తులాలు వెండి గొలుసులు, రూ.50వేల నగదును ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున నిద్ర లేచిన నాగభూషణ భార్య లేచి కిందికి రాగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమణించి భర్తలకు చెప్పింది. ఆయన వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో సీఐ కౌలుట్లయ్య, ఎస్సై విజయ్‌కుమార్, ట్రైనీ ఎస్సై దయాకర్‌రెడ్డి, డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వాహన టైర్లు...

**నార్పల :** మండల కేంద్రంలోని దుగుమర్రి రోడ్డులో జూనియర్ కళాశాల వద్ద నిలిపిన బొలేరో వాహనానికి చెందిన టైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నార్పలకు చెందిన వడ్డే మహేష్ తనకున్న బొలెరో వాహనాన్ని శనివారం రాత్రి జూనియర్ కళాశాల వద్ద నిలిపాడు. అయితే అర్ధరాత్రి గుర్తు తెలియని దండుగులు వాహనానికి సంబంధించిన రెండు టైర్లను అర్ధరాత్రి దొంగలించినట్లు బాధితుడు వాపోయాడు. కాగా మహేష్ మూడు రోజుల క్రితమే బొలేరో వాహనాన్ని కొనుగోలు చేయడం విశేషం.

## మహిళపై అత్యాచారయత్నం

**పుట్లూరు :** మరదలపై బావ అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్.గూడూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ ఆరోగ్యం బాగలేక తాడిపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి చేరుకుంది. అయితే ఇంట్లో భోజనం లేకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న బావ రాజకుల్లాయప్ప ఇంటికి వెళ్లింది. 'అన్నం ఉందా బావా' అని అడగ్గా ఉంది తీసుకుపో అని చెప్పాడు. దీంతో ఇంట్లోకి వచ్చిన మరదలిపై అత్యాచారయత్నానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుని పారిపోయింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి రాజకుల్లాయప్పను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యాసరచన పోటీలు

**అనంతపురం :** అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగగా ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో ప్రస్తుత కాలంలో 'పోలీస్‌వ్యవస్థలో సాంకేతికత పాత్ర' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది వ్యాసరచన, వక్తృత్వ పోటీల ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐలు పవన్‌కుమార్, మధు, ఆర్ఎస్ఐలు బాబ్జాన్, మగ్బూల్, రమేష్‌నాయక్, జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 27 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

**నార్పల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 27వ తేదీ నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు నార్పల వ్యాయామ ఉపాధ్యాయుడు ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని పాఠశాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

## 28 నుంచి శిక్షణ

**పుట్లూరు :** మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 28, 29వతేదీల్లో ఒఎస్ఆర్‌పై మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు. ఎంపిడిఒ అలివేలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు తప్పక హాజరు కావాలని కోరారు.

**యల్లనూరు :** ఈనెల 28, 29వతేదీల్లో సర్పంచులతోపాటు సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కరుణసాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పంచాయతీల అభివృద్ధికి సొంత నిధులు ఎలా ఏర్పాటు చేసుకోవాలి.. వాటి అమలు, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## కవితలకు ఆహ్వానం

**అనంతపురం :** రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 30వతేదీన అనంతపురంలో నిర్వహించనున్న రాయలసీమ మహాకవి సమ్మేళనానికి కవితలను ఆహ్వానిస్తున్నట్లు వేదిక సమన్వయకర్త అప్పిరెడ్డి హరినాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవితలు రాయలసీమ ప్రసిద్ధ ప్రదేశాల నేపథ్యంగా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు సెల్.. 99639 17187 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## తెప్పోత్సవం ఏర్పాట్లు పరిశీలన

**శింగనమల :** మండల కేంద్రంలోని చెరువులో ఈనెల 2వతేదీన నిర్వహించనున్న తెప్పోత్సవం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను చెరువు ఆయకట్టు ఛైర్మన్ జి.సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, చాకలి వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు పంపిణీ

**తాడిపత్రి రూరల్ :** మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాంబాబు శనివారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ పిల్లలకి అందుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత నాణ్యతగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, సుబ్బారావు, రమాదేవి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

# కలెక్టర్‌తో ఎమ్మెల్యే దగ్గుపాటి భేటీ

### పలు సమస్యలపై చర్చ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌తో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఛాంబర్లఓ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నగరంలోని పలు సమస్యల గురించి చర్చించారు. నడిమి వంక పరిసర ప్రాంతాల్లో వరద నీటి ముంపు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఆ ప్రాంతంలో కొంత మంది అనధికారికంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. మరికొందరు పట్టాదారులు కూడా ఉన్నారన్నారు. వీరికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలన్నారు. వర్షాకాలంలో నీరు రోడ్డుపై ప్రవహించి రహదారి దెబ్బతిన్న పరిస్థితి ఉందన్నారు. ఇక్కడ రోడ్డుకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓల్డ్ టౌన్ తాడిపత్రి రోడ్డులో పాత మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ బిల్డింగ్ పూర్తిగా పాడైపోయిన స్థితిలో ఉందని, భద్రతా కారణాల దష్ట్యా పాత బిల్డింగ్‌ను కూల్చివేసి ఆధునిక సౌకర్యాలతో కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ప్రస్తుతం ఉన్న మున్సిపల్ గెస్ట్ హౌస్ ఉపయోగించడానికి అనుకూలంగా లేదని, ఈ స్థానంలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో కొత్త గెస్ట్ హౌస్ నిర్మించాలని కోరారు. ఆలమూరు, సనప చెరువులు పూర్తిస్థాయిలో నిండినప్పుడు రుద్రంపేట పరిసర ప్రాంతాల ఇళ్లలోకి నీరు వస్తోందన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చెరువు ప్రవాహ కాలువల పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి.. నీటి పారుదల మార్గాలు సుగుమం చేయాలని కోరారు. 2020-2024లో జగనన్న లేఔట్స్ పేరుతో పత్రాలు జారీ చేసి, లేఔట్‌లో స్థలాలు ఇవ్వలేదన్నారు. రికార్డులలో పట్టాలు ఇచ్చినట్టు చూపిస్తున్న వాస్తవంగా స్థలాలు లేవన్నారు. ఈ విషయంలో బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్న అంశాన్ని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు నాలుగు పంచాయతీల పరిధిలో ఉన్న సమస్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఎమ్మెల్యే చెప్పిన అంశాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అధికారులతో చర్చించి అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## అట్టహాసంగా ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 బాల, బాలికల చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ మండల స్థాయి పోటీలను శనివారం నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచి ఎంపికైన వారు త్వరలో జరిగే మండలాల పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, సన్‌రైజర్స్ స్కూలు కరస్పాండెంట్ మారెన్న, పీడీ గోపాల్‌రెడ్డి, మండల స్పోర్ట్స్ వ్యాయామ ఉపాధ్యాయులు కోటప్ప, రాఘవేంద్ర, రాధాకృష్ణ, మల్లోబన్న, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

**యల్లనూరు :** విద్యాశాఖ ఆదేశాల మేరకు అండర్-17, 14 ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండల పరిధిలోని చిలమకూరు ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో వెన్నపూసపల్లి, యల్లనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, షెటిల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గం స్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## విద్యార్థినులకు వైద్య పరీక్షలు

**యల్లనూరు :** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్యులు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా మలేరియా, టైఫాయిడ్, రక్త హీనత, తదితర పరీక్షలు చేశారు. అనంతరం వైరల్ ఫీవర్, దగ్గు, జలుబుతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి

### జెడిఎ ఉమామహేశ్వరమ్మ

**ప్రజాశక్తి-అనంతపురం**

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు రైతులకు స్థానికంగా అందుబాటులో ఉండాలని పంటలకు అవసరమైన ఎరువులు కొరత రానీయకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు. ఉమామహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జెడిఎ కార్యాలయంలో సమావేశ మందిరంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులతో రబీ 2025-26 సంసిద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రబీ 2025-26 సీజన్ కి సంబంధించిన సాగు విస్తీర్ణం గురించి చర్చించారు. రాబోయే నాలుగు రోజులు తుఫాన్ హెచ్చరికలు ఉండటం వలన క్షేత్రస్థాయిలో రైతులను అప్రమత్తం చేసి పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని జెడిఎ సూచించారు. రబీ 2025-26 పంటల బీమా సంబంధించి రైతులలో అవగాహన కల్పించాలన్నారు. పంట నమోదుకరు ఈనెల 30 వరకు గడువు ఉన్న నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేసి మిగిలిన విస్తీర్ణం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎలు రవి, యల్లప్ప, అల్తాఫ్ అలీ ఖాన్, పద్మజ, సత్యనారాయణ, ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, మండల వ్యవసాయ అధికారులతో పాటు సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్ నాయక్, వంశీ, సునీత, శశి కళ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జెడిఎ

## లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

### డిఎంహెచ్ఓ ఇబి. దేవి

**ప్రజాశక్తి-అనంతపురం**

స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్ఓ ఇబి దేవి హెచ్చరించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పిసిపిఎన్‌డిటి యాక్ట్ అమలుపై జిల్లాస్థాయి సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ దివ్య, డాక్టర్ దుర్గేష్ ఆర్డీటీ, రామ్మోహన్ స్వచ్ఛంద సంస్థ, డెమో ఇ.నాగరాజు, ఎం.త్యాగరాజు, గంగాధర్, వేణుగోపాల్, వెంకటేష్, కిరణ్, శ్రీకాంత్, ఐసిడిఎస్ సంధ్యారాణి, లీగల్ కన్సల్టెంట్ ఆషారాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ దేవి

**మాతాశిశు మరణాలను అరికట్టాలి**

మాతాశిశు మరణాలను తగ్గించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని డిఎంహెచ్ఓ ఇబి దేవి సూచించారు. శనివారం అనంతపురంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలో జరిగిన మాతా, శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఒక మాతా మరణం, ఆరు శిశు మరణాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవీన్‌కుమార్, రవికుమార్, డిసిహెచ్ఎస్ సిబ్బంది ఇందిరా ప్రియదర్శిని, రాధిక, ప్రోగ్రాం ఆఫీసర్లు జి.నారాయణ స్వామి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## రహదారి భద్రత, సంరక్షణకు ప్రాధాన్యత

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

రహదారి భద్రత, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో రహదారి భద్రత, సంరక్షణ, నివారణ, నియంత్రణ చర్యలపై ప్రజలు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పరస్పరం అవగాహన తోపాటు బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను అలవర్చుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అన్నారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. స్కూల్ బస్సులు, ఆటోల్లో పరిమితికి మించి అనుమతించరాదు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది బాలు, మంజు, లోకేష్, 200 ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ జయనాయక్

## 'జెసి'పై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాశక్తి-అనంతపురం**

తాడిపత్రి ఎఎస్పీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు కోరారు. ఈమేరకు శనివారం నగరంలోని కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ ధరణికిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న ప్రభాకర్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకుని ప్రజల్లో పోలీసులపై ఉన్న విశ్వాసాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) సభ్యులు పాల్గొన్నారు.